క్లుప్తంగా

అడపా దుర్గకు అభినందనలు



అడపా దుర్గ

కాట్రేనికోన: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో ఉన్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్(ఎస్వీబీసీ) సలహాదారునిగా నియమితులైన కాట్రేనికోనకు చెందిన అడపా నాగు దుర్గారావు(దుర్గ)కు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, ఈస్టన్ డెల్టా చైర్మన్ యేడిద చక్రపాణిరావు, నల్లా నరిసింహమూర్తి, గంటి సుధాకర్, ఏడిద సుబ్బు తదితరులు అభినందనలు తెలియజేశారు. తిరుపతిలో బాధ్యతలు స్వీకరించిన దుర్గకు కోనసీమ నుంచి పలువురు ఫోన్లు చేసి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారి జన్మదిన వార్షికోత్సవాలు ప్రారంభం



పూల దండలతో అలంకరించిన శ్రీదేవి అమ్మవారి ఆలయం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదిన వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ వరకూ వార్షికోత్సవాలు జరుగుతాయని శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూల దండలతో అలంకరించారు. తొలి రోజు అమ్మవారికి ఆవుపాలు, ఆవు పెరుగు, పంచామృతాలు, సుగంధ మూలికా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మ వారి సన్నిధిలో అష్ట గణపతి హోమం, తొలి మహా విద్యా శ్రీకాళీదేవి హోమం నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికైన పటవల హైస్కూల్ విద్యార్థులు

తాళ్లరేవు: ఈ నెల 11 నుంచి 13 వరకూ కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఇడుపుగుళ్లలో జరిగే రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు పటవల హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ మాచరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–17 విభాగం నుంచి అరదాడి సత్తిరాజు, దున్నా రాజు, అండర్–14 విభాగం నుంచి ఓలేటి మహాలక్ష్మి ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, గ్రామ సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, హైస్కూల్ హెచ్‌ఎం టి.కాశీవిశ్వనాథం అభినందించారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో



గొల్లవిల్లి సీఎస్ఎం కళాశాలలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సీఎస్ఎం, ఎంఎస్ఎస్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల విలువైన సమయాన్ని వృథా చేయకుండా కళాశాలలోనే ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మరో మూడు రోజుల పాటు ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విలసవిల్లిలో నవగ్రహ నక్షత్ర పూజలు



రామాలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామాలయంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర మహా సౌరయగం పూజలు బుధవారం 18వ రోజు వైభవంగా జరిపారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కారములు, సౌర అష్టాకరి జపాలు చేశారు. భక్తులచే గోపూజ జరిపారు. ఉత్తర నక్షత్ర జాతకులచే జువ్వి చెట్టుకు ప్రత్యేక పూజలు చేయించారు. మహా సౌరయాగ పూజలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సూచించారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెం క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు(శ్రీను) అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పాలనపై సానుకూలంగా ఉన్నారని చెప్పారు. పార్టీ కోసం శ్రమిస్తున్నవారిని గుర్తించి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లుగా నియమించామన్నారు. 15 రోజుల్లో ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలియ జేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు బుర్రా అనుబాబు మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి మురియాం జ్యోతి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, పిన్నమరాజు శ్రీనురాజు, ఢిల్లీ నారాయణ, మోకా రవికుమార్, ఇందుకూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారామాలయ ప్రతిష్ఠా పూజలు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో పునర్నిర్మించిన సీతారామాలయంలో ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజైన బుధవారం వేద పండితులు సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు నవకలశారాధన, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం జరిగిన స్వామివారి ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. తన చేతుల మీదుగా అనేక భగవత్కార్యాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. తన తండ్రి పేరిట మురమళ్ల స్నానఘట్టం వద్ద పరమశివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశానన్నారు. ఎదుర్లంక వంతెన వద్ద సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో 63 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి నిర్మాణం, నీళ్లరేవు గ్రామంలో సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో కాలభైరవస్వామి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్త కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ చిట్టూరి నాగమణి, కలికిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి స్థల పరిశీలన



బోడసకుర్రులో డ్రెయిన్ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ధ్యానచంద్ర

అల్లవరం: బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో భవనాల నుంచి వచ్చే వ్యర్థ జలాలను తరలించేందుకు డ్రెయిన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర బుధవారం పరిశీలించారు. రైతుల నుంచి భూములు సేకరించి డ్రెయిన్ నిర్మాణం చేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వరి క్షేత్రాల మధ్య నుంచి డ్రెయిన్ నిర్మాణం జరిగితే వ్యవసాయ పనులకు ఇబ్బంది ఏర్పడుతుందని, వరదల సమయాల్లో వరద నీరు డ్రెయిన్‌లోకి ఎదురెక్కి పంట పొలాలను ముంచెత్తుతుందని రైతులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ భూమిలో డ్రెయిన్ నిర్మాణానికి ఉన్న అవకాశాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, తహసీల్దార్ ఎస్ఎస్ ప్రసాద్‌లను జేసీ ఆదేశించారు. అనంతరం ఒడలరేవులో కేంద్రీయ విద్యాలయానికి సేకరించిన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, హౌసింగ్ డీఈ ప్రసాద్‌రాజు, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుకు పలువురి పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీనును పట్టణంలోని పలువురు ప్రముఖులు పరామర్శించారు. శ్రీను తల్లి రత్నకుమారి(67) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ యాళ్ల దొరబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనును పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తదితరులు సంతాపం తెలిపారు.

పశువుల దాణా పంపిణీ



రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గ రైతాంగానికి పశు సంరక్షణ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఏఓ మునిస్వామి 273 మంది రైతులకు పశువుల దాణాను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంపద అభివృద్ధి కోసం 75 శాతం రాయితీతో పశువుల దాణాను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పశువులకు మెరుగైన వైద్యం అందించడం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో యూడీసీ బేగం, ఫీల్డ్‌మెన్ గీదా పండు, పి.సత్యనారాయణమ్మ, ఆర్.శ్రీను, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలి

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



మురమళ్లలో పరమశివుని విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ఐ.పోలవరం: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవడం ద్వారా సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మురమళ్ల వృద్ధ గౌతమీ పుష్కర ఘాట్ సమీపంలో స్వర్గీయ పొన్నాడ సత్యారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ రూ.4 లక్షల విరాళంతో ఏర్పాటు చేసిన పరమశివుని విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఎన్నారై డా.రమాకృష్ణవేణి రూ.3 లక్షలు, దాతల ద్వారా మరో రూ.2 లక్షల విరాళంతో ఏర్పాటుచేసిన కాశే బులి మాణిక్యం మెమోరియల్ పార్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మిరియాం జ్యోతి, గ్రామ సర్పంచ్ కాశే రాజబాబు, వీరేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పెన్మత్స వాసురాజు, ధూళిపూడి చక్రం తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి కరపత్రాల ఆవిష్కరణ

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 22 వరకూ జరిగే మహాశివరాత్రి మహోత్సవాల కరపత్రాలను బుధవారం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ నెల 18న ద్వాదశ పుష్కర నదీజలాలతో స్వామివారికి అభిషేకం, సాయంత్రం శూలాల సంబరం, 22న ఆలయం నుంచి పుష్కర ఘాట్ వరకు మేళతాళాలతో భారీ ఊరేగింపు, గోదావరి తీరాన పంచహారతులు, స్వామి,అమ్మవార్ల తెప్పోత్సవం ఉంటుందని ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెన్మత్స వాసురాజు, గ్రామ సర్పంచ్ కాశే రాజబాబు, కొలిశెట్టి గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



గణపతినగర్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు

యానాం: పట్టణ పరిధిలోని గణపతినగర్‌లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోరుతున్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అనేక ఏళ్లుగా తమ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను వేయకపోవడం వల్ల సమస్య జటిలమవుతుందని, సంబంధిత విద్యుత్ శాఖాధికారులు స్పందించి తమ సమస్యలు తీర్చాలని వల్లు లీలావతి, వీవీ రామకృష్ణ, కె.శ్రీనివాస్, కుడిపూడి మంగాలక్ష్మి, ఆర్.నాగబాబు, కె.ధనలక్ష్మి తదితరులు కోరుతున్నారు.

వైభవంగా గంధోత్సవం



అమలాపురంలో గంధోత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్న షియా ముస్లింలు

అమలాపురం టౌన్: పట్టణంలో హజ్రత్ ఇమామ్ అలీ గంధోత్సవాన్ని షియా ముస్లింలు బుధవారం వైభవంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త అల్లుడైన హజ్రత్ ఇమామ్ అలీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ గంధోత్సవాన్ని చేపట్టారు. స్థానిక 12వ వార్డులో ఉన్న పీర్ల పంజా నుంచి గంధాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఒడిశా నుంచి వచ్చిన మత గురువు మహ్మద్ హైదర్ ఈ గంధోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. పంజా అధ్యక్షుడు మహ్మద్ నిసార్ హుస్సేన్, కార్యదర్శి మహ్మద్ కర్రార్ హుస్సేన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో సూర్యప్రకాశరావు

అమలాపురం రూరల్: వార్డు, గ్రామ సచివాలయాల వారీగా బడి బయటి పిల్లలను గుర్తించి వారిని కచ్చితంగా పాఠశాలల్లో లేదా ఎస్ఆర్‌పి స్టీసీ సెంటర్లలో చేర్పించాలని ఎంపీడీఓ కాశీ విజయప్రసాద్, ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ కార్యదర్శులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ, ఎంఈవోలు మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తమ పరిధిలో వలంటీర్ల వారీగా బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఎఎల్ఎస్ఓ రమేష్, సీఆర్‌పీలు నాగన్న, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్ర ప్రచార వాహనం ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం భారత జోడో యాత్రకు సంబంధించి నియోజకవర్గ ప్రచార వాహనాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అయితాబత్తుల సుభాషిణి జెండా ఊపి ప్రారంభించారు. అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్ మండలాల్లో ప్రచార వాహనం పర్యటించింది. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర విజయవంతానికి ఈ వాహనం ద్వారా ప్రచారం చేస్తామని సుభాషిణి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నుగ్గ ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు మెహబూబ్ షకీలా, అడపా మాచరరావు, తోపెల్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎస్ఐగా నూకరాజు బాధ్యతలు



ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నూకరాజు

యానాం: యానాం పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐగా శేరు నూకరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ విధులు నిర్వర్తించిన బడుగు కనకారావు పుదుచ్చేరికి బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోస్టల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న నూకరాజుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పుదుచ్చేరి పోలీస్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఐ నూకరాజు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

శివారు భూములు పరిశీలించిన ఆర్డీఓ, జేడీ



గ్రాంటు గ్రామానికి వెళ్లే కాలువను రైతులతో కలిసి పరిశీలిస్తున్న కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ

తాళ్లరేవు: సాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేయాలంటూ పి.మల్లవరం పంచాయతీ శివారు పత్తిగొంది, గ్రాంటు గ్రామాలకు చెందిన రైతులు రోడ్డెక్కిన నేపథ్యంలో కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్, ఏడీఏ కె.బాబూరావు శివారు భూములతో పాటు కాలువలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, నీరలేక వరిచేలు ఎండిపోతున్నాయని రైతులు తమ గోడును మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రమణ మాట్లాడుతూ శివారు ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర భూములకు సాగు నీటి ఎద్దడి నేపథ్యంలో జలవనరులశాఖ మూడంచెల విధానం కాకుండా ఐదంచెల విధానంలో నీటిని విడుదల చేయాలని ఆదేశించామన్నారు. పత్తిగొంది వద్ద క్రాస్‌బండ్లను పరిశీలించి చేపట్టవలసిన చర్యలపై అధికారులతో చర్చిస్తామన్నారు.

సీలేరు అదనపు జలాల విడుదలతో

సీలేరు అదనపు జలాల విడుదలతో సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పి.మల్లవరం పంచాయతీలోని శివారు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం సీలేరు నుంచి 1750 క్యూసెక్కుల నీరు వస్తుందని, మరో 1750 క్యూసెక్కుల కోసం జిల్లా కలెక్టర్ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఆ నీటిని సరఫరా చేస్తే సాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏఓ ఎస్. ప్రశాంతి, ఆర్ఐ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ ప్రకాష్‌కు సీఎం సత్కారం



పీఈటీ ప్రకాష్‌ను సత్కరించిన సీఎం రంగసామి

యానాం: క్రీడా రంగంలో విశేష సేవలందిస్తూ ఉత్తమ క్రీడాకారులను తయారు చేస్తున్నందుకు గుర్తింపుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్, యానాం జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీవీఎస్ ప్రకాష్(స్వామి)ను పుదుచ్చేరి సీఎం రంగసామి ఘనంగా సత్కరించారు. బుధవారం పుదుచ్చేరిలో స్కూల్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ బహుమతి ప్రధానోత్సవం అనంతరం పీఈటీ ప్రకాష్‌ను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు నక్కల సుబ్బన్న, పాము సత్యనారాయణ, కొప్పనాతి రమేష్, భాస్కర్, చింతా వెంకన్న, జల్లి చంద్రశేఖర్, ఇందుగుల చిన్ని, వినకోటి సన్యాసిరావు తదితరులు ఆయనను అభినందించారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు జయప్రకాష్ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పనుల్లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పరిశీలకులు కె.జయప్రకాష్, సీఎంఓ చామంతి నాగేశ్వరరావులు పరిశీలించారు. మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ గుమ్మళ్లపేట ఎంపీపీ స్కూల్, కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం హైస్కూల్, సీతారామపురం ఎంపీపీ స్కూల్, నీలపల్లి, ఇంజరం జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్స్‌లో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిధుల నమోదు రిజిస్టర్‌లు, నగదు చెల్లింపుల పుస్తకాలు, స్టాక్ నమోదు తదితర నాడు–నేడు కాంపొనెంట్‌లకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.

యానాం నవోదయ విద్యార్థుల ప్రతిభ



కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని లాస్య

యానాం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా యూనిటీ ఇన్ క్రియేటివిటీ అనే అంశానికి సంబంధించి రంగవల్లుల పోటీల్లో యానాం జవహర్ నవోదయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పుదుచ్చేరి స్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి కుమారి లాస్య పుదుచ్చేరి నుంచి ప్రాతినిథ్యం వహించి మూడో స్థానాన్ని సాధించిందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి మీనాక్షిలేఖి నుంచి ప్రశంసాపత్రంతో పాటు రూ.50 వేల నగదు పురస్కారాన్ని అందుకుందని తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు మాస్టర్ దుర్గేష్, బాలాజీ లలిత్‌లు తయారుచేసిన బీఎంఐ ప్రాజెక్టు అహ్మదాబాద్‌లో జరిగిన నేషనల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌లో ప్రదర్శించారన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



అధికారులు పట్టుకున్న మద్యం సీసాలు

యానాం: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు బుధవారం ఇన్‌ఛార్జి ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. 22 రాయల్ స్టాగ్ ఫుల్‌బాటిల్స్‌ను బైక్‌పై నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా యానాం బైపాస్ రహదారిలో హెడ్‌కానిస్టేబుల్స్ కడలి శ్రీనివాస్, పెమ్మాడి కృపానందంలు నిందితులను పట్టుకున్నారని చెప్పారు. నిందితుల్ని కేసు నమోదు నిమిత్తం యానాం ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించినట్లుగా తెలిపారు.

కొత్త పథకాలకు రూపకల్పన చేయండి

యానాం: స్పెషల్ కాంపోనెంట్ ఫండ్ ద్వారా ఆది ద్రావిడ సంక్షేమ శాఖ అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి మరిన్ని కొత్త సంక్షేమ పథకాలకు రూపకల్పన చేయాలని పుదుచ్చేరి సంక్షేమ మంత్రి చంద్ర ప్రియాంక కోరారు. బుధవారం స్పెషల్ కాంపోనెంట్ నిధుల ఖర్చుపై 22 శాఖల అధికారులతో ఆమె పుదుచ్చేరి అసెంబ్లీ సెమీనార్ హాలులో ఆది ద్రావిడ కార్యదర్శి కేశవన్ అధ్యక్షతన సమావేశం జరిపారు. ఈ సమావేశంలో హెల్త్ డైరెక్టర్ శ్రీరాములు, విద్యాశాఖ డైరెక్టర్ రుద్రగౌడ, రిజిస్టర్ కోపరేటివ్స్ యశ్వంతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం

కాట్రేనికోన: దొంతికుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మల్లాడి లోవరాజు గరగ నృత్యం నేర్చుకున్నాడు. గత నెల 26న దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ శకటంపై గరగ నృత్య బృందంలో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ప్రధానోపాధ్యాయుడు వై.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు డీవీ నారాయణ, వేణుగోపాల్, వర్మ తదితరులు విద్యార్థి మల్లాడి లోవరాజును బుధవారం సత్కరించి మెమోంటోను అందజేశారు.

మునీంద్రరావుకు ఎమ్మెల్యే పరామర్శ

ముమ్మిడివరం: మాతృవియోగంతో బాధపడుతున్న గాడిలంక గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. మునీంద్రరావు తల్లి సత్యవతి(92) ఇటీవలే వృద్ధాప్యంతో మృతి చెందారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కోలా బాబ్జీ తదితరులున్నారు.

వేలం ద్వారా రూ.1.39 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: ర్యాలిలోని ఉమాకమండలేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఐదు షాపులకు వేలం పాటల నిర్వహణ ద్వారా రూ.1.39 లక్షల ఆదాయం లభించింది. గుంటూరుకు చెందిన దాత దేచిరాజు సత్యనారాయణమూర్తి తన సొంత నిధులను వెచ్చించి ఈ షాపులను నిర్మించారు. వీటికి బుధవారం జెడ్పీటీసీ బోణం సాయిబాబా, అవుట్‌సోర్స్ ఎంప్లాయిస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్ సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. దీని ద్వారా నెలసరి అద్దెలుగా రూ.11.600, ఏడాదికి రూ.1,39,200 లభిస్తున్నట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. అనంతరం దాత సత్యనారాయణమూర్తిని సత్కరించారు.